ప్రజాశక్తి
గురువారం 27 మార్చి 2025 | 5 | అనంతపురం

దెబ్బతిన్న వాహనాలను పరిశీలిస్తున్న పోలీసులు

టిడిపి, వైసిపి నాయకుల మధ్య ఘర్షణ

రామగిరి ఎంపిడిఒ కార్యాలయం వద్ద పరస్పర దాడులు
144సెక్షన్ విధించిన పోలీసులు

ప్రజాశక్తి - రాప్తాడు

శ్రీసత్యసాయి జిల్లా రామగిరి ఎంపిడిఒ కార్యాలయం వద్ద టిడిపి, వైసిపి నాయకుల మధ్య సోమవారం ఘర్షణ చోటు చేసుకుంది. ఈ సందర్భంగా పరస్పరం దాడులు చేసుకున్నారు. వైసిపి నాయకులకు చెందిన వాహనాలను టిడిపి నాయకులు ధ్వంసం చేశారు. వైసిపి నాయకులను ఎంపిడిఒ కార్యాలయంలో నిర్బంధించారు. ఈఘటనకు సంబందించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

రామగిరి ఎంపీపీ ఎన్నికకు సంబంధించి బి ఫాం అందజేసేందుకు వైసిపి నాయకులు ఎంపిడిఒ కార్యాలయానికి బుధవారం వెళ్లారు. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డికి చెందిన వాహనంలో లీగల్ సెల్ నాయకుడు న్యాయవాది కురుబ నాగిరెడ్డి, రాప్తాడు వైస్ ఎంపిపి బోయ రామాంజనేయులు, వాలంటరీ విభాగం శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు ముష్టి కోవెల హరినాథ్ రెడ్డి ముగ్గురు కలిసి బీఫామ్ అందజేసేందుకు రామగిరి ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నారు. అప్పటికే అక్కడ ఉన్న టిడిపి నాయకులు వీరి వాహనంపై దాడి చేసి ధ్వంసం చేశారు. అంతటితో ఆగకుండా బోయ రామాంజనేయులు, ముష్టికోవెల హరినాథరెడ్డిని కొట్టుకుంటూ ఎంపీడీవో కార్యాలయంలోకి తీసుకెళ్లి అక్కడ నిర్బంధించారు. బయట ఉన్న న్యాయవాది నాగిరెడ్డిపై కూడా దాడి చేసి ఎంపీడీవో కార్యాలయంలోకి లాక్కెళ్లి బంధించారు. ఈఘటనలతో రామగిరిలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇరుపార్టీల నాయకులు రాడ్లు, కర్రలతో దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో పలు వాహనాలు ధ్వంసం అయ్యాయి. వెంటనే స్పందించిన పోలీసులు పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు ధర్మవరం డీఎస్పీ హేమంత్ అక్కడికి చేరుకున్నారు. వాహనాలను స్టేషన్‌కు తరలించారు. రామగిరి ఎంపిపి ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్పీ ఆదేశాల మేరకు రామగిరిలో 144 సెక్షన్ విధించారు.

పోలీసుల అదుపులో తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి : రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని సోమందేపల్లి పోలీసులు అదుపులో తీసుకున్నారు. రామగిరి ఎంపిడిఒ కార్యాలయం వద్ద టిడిపి, వైసిపి శ్రేణుల మధ్య ఘర్షణ చోటు చేసుకోవటంతో వైసిపి శ్రేణులకు మద్దతుగా వెళుతున్న ఆయనను జాతీయ రహదారిపై డీఎస్పీ వెంకటేశ్వర్లు అదుపులోకి తీసుకున్నారు. అక్కడి వెళితే లా అండ్ ఆర్డర్ సమస్య వస్తుందని పోలీసులు ఆయనకు చెప్పారు.

టీడీపీది పైశాచిక చర్య : వైసిపి

సోమందేపల్లి : జిల్లాలో టిడిపి నాయకులు పైశాచిక చర్యలకు పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ విమర్శించారు. రామగిరిలో చోటు చేసుకున్న ఘర్షణ నేపథ్యంలో అక్కడికి వెళుతున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని పెనుకొండ డిఎస్పి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని వై జంక్షన్లో అదుపులోకి తీసుకున్నారు. ఆయనను స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ వెంటనే స్టేషన్ కు చేరుకున్నారు. అక్కడ తోపుదుర్తి పరామర్శించి అనంతరం డిఎస్పితో మాట్లాడారు, ఏ తప్పు చేయని ప్రకాష్ రెడ్డిని ఎందుకు అరెస్ట్ చేశారని ప్రశ్నించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రామగిరి ఎంపీపీ ఎంపికకు సంబంధించి గెజిట్ రావడంతో వాటిని పర్యవేక్షించడానికి బెంగళూరు నుండి రామగిరి వెళుతున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డినికావాలనే టీడీపీ పెద్దలు అరెస్ట్ చేయించారన్నారు. నియోజకవర్గంలో టిడిపి నాయకులు కావాలని రెచ్చగొట్టి దాడులు చేస్తున్నారన్నారు. రామగిరి మండలంలో టిడిపికి కేవలం ఒక ఎంపీటీసీ మాత్రమే ఉన్నారని, మిగిలిన ఎంపీటీసీలు తమ వైపు ఉన్న ఓడిపోతామని తెలిసినా కావాలని రెచ్చగొట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రామగిరి ఎంపీపీ మహిళలకు రిజర్వేషన్ అయిందని, మహిళా ఎంపీటీసీలు అంతా తమ పక్కన ఉంటే అటువైపు ఎవరు లేకున్నా ఎలా వారికి ఎంపీపీ పదవి దక్కుతుందో అర్థం కావడం లేదన్నారు. ప్రశాంతంగా జరగాలని తాము అనుకొంటున్నా కావాలనే రెచ్చగొడుతూ దాడులు చేస్తూ తమపై కేసులు పెట్టేందుకు సిద్ధమవుతున్నారన్నారు. గెలవలేమని తెలిసినా దాడులు, దౌర్జన్యాలు చేస్తూ పైసాచిక ఆనందం పొందుతున్నారన్నారు. జిల్లాలోని ఇద్దరు మంత్రులు ఇలాంటి వాటిని నియంత్రించాల్సింది పోయి రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. జడ్పీటీసీ డీసి అశోక్ కుమార్, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు రమకాంతరెడ్డి, ఇమామ్ వలి, నరసింహామూర్తి, సూర్యప్రతాప్ రెడ్డి, రామాంజినేయులు, మంజునాథ్, నవకోటి శివ, నాగరాజు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

డీఎస్పీతో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

అభివృద్ధిలో 'శ్రీసత్యసాయి' టాప్

విజయవాడలో నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న అనంతపురం కలెక్టర్ వినోద్‌కుమార్

ద్వితీయ స్థానంలో 'అనంత'
జిల్లాల అభివృద్ధి ప్రణాళికలపై ముఖ్యమంత్రి సమీక్షలో చర్చ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాయలసీమలోని ఐదు జిల్లాల జోన్ పరిధిలో అభివృద్ధిలో శ్రీసత్యసాయి జిల్లా టాప్‌లో ఉండగా, అనంతపురం జిల్లా రెండవ స్థానంలో ఉంది. జిల్లాల ప్రగతిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రెండు రోజులుగా జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. రెండవ రోజు అయిన బుధవారం నాడు జిల్లా పురోగతిపై అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్లు డాక్టర్ వినోద్‌కుమార్, చేతన్ తమతమ జిల్లాల ప్రగతిని వివరించారు. ఐదేళ్ల అభివృద్ధి ప్రణాళికల గురించి వివరించారు. అనంతపురం జిల్లాలో వ్యవసాయం, ఉద్యానవన పంటలతోపాటు, టూరిజంపైనా ప్రధానంగా ఫోకస్ చేస్తున్నట్టు కలెక్టరు వినోద్‌కుమార్ వివరించారు. మూడు క్లస్టర్లు, మూడు సర్క్యూట్లు రూపొందించినట్లు చెప్పారు. అదే విధంగా హంద్రీనీవా వైడనింగు గురించి ప్రస్తావించారు. ఎంఎస్‌ఎంఇల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సత్యసాయి జిల్లా కలెక్టరు చేతన్ సత్యసాయి జిల్లా అభివృద్ధికి ఉన్న అవకాశాల గురించి వివరించారు. ఎగువ ప్రాంతంలో సత్యసాయి జిల్లా ఉండటంతో వర్షపాతం పడిన తరువాత జలాలు చిత్రావతి, పెన్నా నదిలో చేరాయన్నారు. అనంతరం చంద్రబాబునాయుడు మాట్లాడుతూ అనంతపురం, శ్రీసత్యసాయి, నంద్యాల, కర్నూలు, కడప జిల్లాల జోన్ గురించి వివరించారు. ఈ జోన్‌లో శ్రీసత్యసాయి జిల్లా అగ్రగామిగా ఉందని తెలిపారు. రాష్ట్ర సగటు తలసరి ఆదాయం రూ.311004 అయితే 12.202 శాతం పురోగతి ఉందని శ్రీసత్యసాయి జిల్లా పురోగతి రూ.314751 ఉందని చెప్పారు. 13.57 శాతం అభివృద్ధి చెందిందని చెప్పారు. రాష్ట్ర సగటు కంటే అధికంగా ఈ జిల్లా సగటు ఉందని అన్నారు. ఈ జోన్‌లో చూసినప్పుడు ఈ జిల్లానే టాప్‌లో ఉందని చెప్పారు. ఆ తరువాతి స్థానం అనంతపురం జిల్లా ఉందన్నారు. ఈ జిల్లా రూ.304223 తలసరి ఆదాయం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. అభివృద్ధి సగటు 12.01శాతమన్నారు. రాష్ట్ర సగటు కంటే తక్కువగానే ఉన్నప్పటికీ జోన్‌లో రెండవ స్థానంలో అనంతపురం జిల్లా ఉందని పేర్కొన్నారు. అనంతపురం, సత్యసాయి జిల్లాలకు ఆనుకుని బెంగళూరు ఎయిర్‌పోర్టు ఉండటంతోపాటు కియా పరిశ్రమ వచ్చాక ఈ ప్రాంతాభివృద్ధికి అవకాశాలు మరింత ఎక్కువగా ఉన్నాయన్నారు. వీటితోపాటు హంద్రీనీవా ఈ ప్రాంతంలో గేమ్ ఛేంజర్ కానుందన్నారు. దీన్ని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయడానికి అవసరమైన చర్యలు ఇప్పటికే తీసుకుంటున్నట్లు వివరించారు. ఉద్యానవన పంటలను, పశుపోషణను ప్రోత్సహించాల్సిన అవసరముందని కూడా తెలిపారు. నిర్ణయించుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా ఉండాలని సూచించారు. గ్రామ పంచాయతీల వరకు కూడా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలన్నారు.

గొడవలకు ఆస్కారమయ్యే సమస్యలను పరిష్కరిస్తాం
ఎఎస్పీ రోహిత్‌కుమార్

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

గ్రామాల్లో గొడవలకు అస్కారమయ్యే సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరిస్తామని తాడిపత్రి ఎఎస్పీ రోహిత్‌చౌదరి తెలిపారు. 'మీ మాటే ముఖ్యం' కార్యక్రమంలో భాగంగా బుధవారం పెద్దవడుగూరు పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కువగా పొలం, ఇళ్ల తగాదాల వంటి సమస్యలే అధికంగా వస్తున్నాయన్నారు. వీటిలో కొన్నింటిని పరిష్కరిస్తే సమస్యలు కొంత వరకూ తీరుతాయన్నారు. భూతగాదాల వల్ల గ్రామాల్లో ఫ్యాక్షన్ గొడవలకు పాల్పడుతున్నారని, వీటికి స్వస్తి చెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం 15 సమస్యలు పోలీసుల దృష్టికి రాగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట సిఐ రామసుబ్బయ్య, ఎఎస్ఐ నారాయణనాయక్, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎఎస్పీ రోహిత్‌కుమార్

పార్టీ కోసం సమిష్టిగా పనిచేద్దాం
విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రజలకు జవాబుదారీగా ఉంటూ పార్టీని మరింత బలోపేతం చేద్దామని విప్ కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. బుధవారం గుమ్మగట్ట మండల కేంద్రంలో టిడిపి నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ఐదేళ్ల పాలనలో మనతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. వారు రాష్ట్రాన్ని అన్ని విధాలా దివాళా తీయించారన్నారు. ప్రశ్నించిన ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు బనాయించారన్నారు. తనపైనే 22 అక్రమ కేసులు పెట్టారని గుర్తుచేస్తూ, ఎవరిపై ఎన్ని కేసులున్నాయని ప్రశ్నించారు. సమావేశంలో పాల్గొన్నవారిలో చాలా మంది తమపై కేసులున్నాయని తెలిపారు. జగన్ దుష్టపాలనతో ప్రతిపక్షాలతో పాటు ప్రజలు పూర్తిగా విసుగు చెందరన్నారు. అందుకే గతంలో ఏ పార్టీకి ఇవ్వనన్ని భారీ సీట్లుతో మనకు అధికారాన్ని ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో రావడం, చంద్రబాబు మరోసారి ముఖ్యమంత్రి కావడంతో రాష్ట్రంలో పరిస్థితులు క్రమంగా ఒక్కోటి చక్కబడుతున్నాయన్నారు. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు తనకున్న పాలనాభవంతో చంద్రబాబు తిరిగి ఊపిరి పోస్తున్నారని వివరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి పది నెలల కావస్తోందని తెలిపారు. తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో సతమతమవుతున్న రాష్ట్రం నెమ్మదిగా ప్రగతివైపు నడుస్తోందన్నారు. పార్టీ కోసం పనిచేసిన వారికి ఏ ఆపద వచ్చినా స్థానిక నేతలు తగిన ఓదార్పునివ్వాలన్నారు. మరో ఏడాదిలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగబోతున్న నేపథ్యంలో పార్టీ కోసం ఇప్పటి నుండే ఎంతో శ్రమించాల్సి ఉంటుందన్నారు. నియోజకవర్గ పునర్విభజనకు కసరత్తు జరుగుతోందన్నారు. రాబోయే రోజుల్లో ఎమ్మెల్యే స్థానాల సంఖ్య 225కు పెరగవచ్చన్నారు. రాయదుర్గం నియోజకవర్గ రూపురేఖలు కూడా కొంతమేర మారవచ్చారన్నారు. ఏది జరిగినా పార్టీ ప్రతిష్ట పెంచటానికి ప్రతి ఒక్కరూ శ్రమిద్దామని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండలంలోని టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న విప్ కాలవ శ్రీనివాసులు

పరీక్ష కేంద్రంలో విద్యార్థినికి అస్వస్థత

విద్యార్థినిని పరీక్షస్తున్న వైద్యుడు లోకేష్‌కుమార్

ప్రజాశక్తి-యల్లనూరు

మండల పరిధిలోని చిలమకూరు పరీక్ష కేంద్రంలో పదో తరగతి పరీక్ష రాసేందుకు వచ్చిన ఓ విద్యార్థిని బుధవారం అస్వస్థతకు గురైంది. ఉదయం పరీక్షకు హాజరైన విద్యార్థినికి కళ్లు తిరగడంతో కూర్చొన్న బెంచిలోనే పడిపోయింది. గమణించిన ఇన్విజిలేటర్ వెంటనే సమాచారం ఇవ్వడతో యల్లనూరు ప్రాథమిక వైద్యులు లోకేష్‌కుమార్ హుటాహుటిని విద్యార్థిని వద్దకు చేరుకుని పరీక్షించారు. అనంతరం వైద్యుడు మాట్లాడుతూ విద్యార్థిని ఆహారం తీసుకోకపోవడం వల్ల అస్వస్థతకు గురైందని వివరించారు. ఎలాంటి సమస్య లేకపోవడంతో సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం విద్యార్థిని అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రైల్వే ఆసుపత్రుల సమస్యలు పరిష్కరించాలి
ఎపి ప్రత్యేక రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేయాలి-పార్లమెంట్‌లో ఎంపి అంబికా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రైల్వే ఆసుపత్రుల్లో నెలకొన్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం నిర్వహించిన పార్లమెంట్ సమావేశాల్లో ఎంపీ పలు అంశాలను సభ దృష్టికి తీసుకెళ్లారు. పారా–మెడికల్ సిబ్బంది నియామక సమస్యలు, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఏర్పాటు అవసరం వంటి కీలక అంశాలను కేంద్ర ప్రభుత్వ దష్టికి తీసుకెళ్లారు. ఇప్పటి వరకు ఫార్మసిస్టులు, రేడియోగ్రాఫర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు వంటి పారా–మెడికల్ సిబ్బంది నియామకం పబ్లిక్ ప్రచారం, నియామక కమిటి ద్వారా జరుగుతుందన్నారు. అయితే ఇటీవల ప్రభుత్వ ఈమ్యాట్‌ప్లేస్ (జిఇఎం) ద్వారా మాత్రమే నియామక ప్రక్రియ చేపట్టాలని మార్పు చేశారన్నారు. ఈ విధానం ఆసుపత్రి యాజమాన్యానికి అభ్యర్థుల అర్హతలు, నైపుణ్యాలు, అనుభవం పరిశీలించే అవకాశాన్ని తగ్గిస్తోందన్నారు. అంతేకాదు, తరచూ సిబ్బంది మారడం వల్ల ఆసుపత్రి కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడుతోందన్నారు. దీని ప్రభావం రోగులకు అందించే వైద్య సేవల నాణ్యతపై పడుతోందన్నారు. కాబట్టి గత నియామక విధానాన్ని పునరుద్ధరించి, ఆసుపత్రి కమిటీ ఆధ్వర్యంలో మెరిట్ ఆధారంగా నియామకాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ కేంద్రాన్ని కోరారు. ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ స్పందిస్తూ, నియామకాలు గతంలో ప్రత్యక్ష్యంగా నిర్వహించేవని, కానీ ఇప్పుడు పారదృకత కోసం ప్రభుత్వ ఈ– మార్కెట్‌ప్లేస్ (జిఇఎం) ద్వారా చేపడుతున్నామని తెలిపారు. ఈ విధానంలో ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని తెలిపారు.

మున్సిపల్ కార్మికురాలికి సిఐటియు నివాళి

ప్రజాశక్తి-తాడిపత్రి

రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందిన మున్సిపల్ కార్మికురాలు ధనలక్ష్మి(40) మృతికి సిఐటియు నాయకులు బుధవారం నివాళులర్పించారు. ఇటీవల తాడిపత్రిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మున్సిపాలిటీలోని ఇంజినీరింగ్ సెక్షన్ అవుట్ సోర్సింగ్ కార్మికురాలుగా విధులు నిర్వహిస్తున్న ధనలక్ష్మి గాయపడిన విషయి తెలిసిందే. దీంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు వెళ్లి పరిస్థితి విషమించి మృతిచెందింది. విషయం తెలుసుకున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, నాగభూషణం, నాగరాజు, తదితరులు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం కోసం ఉంచిన ధనలక్ష్మి పార్థిక దేహవపై సిఐటియు జెండా కప్పి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు మాట్లాడుతూ ధనలక్ష్మి కుటుంబానికి అన్నివిధాలుగా అండగా ఉంటామన్నారు. మున్సిపల్ ఆఫీసులో ధనలక్ష్మి భర్తకు ఉద్యోగం కల్పించి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. నివాళు లర్పించిన వారిలో సిఐటియు పట్టణ కార్యదర్శి జగన్మోహన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ఉమాగౌడ్, పెద్దపప్పూరు మండల సిపిఎం నాయకులు అమ్మలదిన్నె కుళ్లాయప్ప, మున్సిపల్ నాయకులు అంజి, ప్రసాద్, కెవిపిఎస్ నాయకులు రామ్మోహన్, ధనలక్ష్మి, తదితరులు ఉన్నారు.

ధనలక్ష్మికి నివాళులర్పిస్తున్న సిఐటియు నాయకులు

సీమ ప్రాజెక్టులపై నిర్లక్ష్యం తగదు
రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు



సమావేశంలో మాట్లాడుతున్న రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జ దశరథరామిరెడ్డి

ప్రజాశక్తి - అనంతపురం సిటీ

రాయలసీమ ప్రాజెక్టులపై పాలకులకు నిర్లక్ష్యం తగదని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జ దశరథరామిరెడ్డి అన్నారు. నగరంలోని ఎన్జీవో హోంలోని పెన్ననర్ల భవన్‌లో జలసాధన సమితి అధ్యక్షులు రామ్ కుమార్ అధ్యక్షతన రాయలసీమ నీటి ప్రాజెక్టులు వెనుకబాటు తనం అనే అంశంపై బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన దశరథరామిరెడ్డి మాట్లాడుతూ. గత 35 – 40 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న హంద్రీనీవా గాలేరు నగరి తెలుగు గంగ ప్రాజెక్టు పనులు పూర్తి చేయకుండా గోదావరి జలాలను పెనకచర్లకు తీసుకువచ్చి రాయలసీమలో ప్రతి ఎకరాకు నీళ్లు ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. రాయలసీమ జిల్లాలో పక్కనే ఉన్న కష్ణానదిలోని నీరు ప్రతి సంవత్సరము సముద్రం పాలవుతున్న వందల టీఎంసీల నీటిని తీసుకోవడానికి తగిన ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, కాలువల వ్యవస్థ పూర్తి చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. 2014–2019 సంవత్సరాల మధ్య 68 వేల కోట్ల రూపాయలు సాగునీటి రంగానికి చంద్రబాబు ఖర్చు చేశారన్నారు. ఇందులో రాయలసీమకు 12400 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు చంద్రబాబు చెబుతున్నారన్నారు. అంటే సాగునీటి బడ్జెట్లో రాయలసీమకు కేవలం 18 శాతం మాత్రమే ఖర్చు చేసి, 82 శాతం కోస్తా ప్రాంత ప్రాజెక్టులకు ఖర్చు చేశారని విమర్శించారు. దీన్ని బట్టి చూస్తే చంద్రబాబు ఎవరి ప్రయోజనాలు కాపాడుతున్నారో అర్థమవుతుందని అన్నారు. ఏపీ అంటే అమరావతి పోలవరం అన్నట్టు అభివృద్ధి అంతా ఒకే ప్రాంతంలో కేంద్రీకరించి రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాలను నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో ఈ సమావేశంలో జల సాధన సమితి ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి, రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఇండ్ల ప్రభాకర్ రెడ్డి, కార్యదర్శి నాగరాజు, సహాయ కార్యదర్శి కృష్ణ, ఒపిడిఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి ఉపేంద్ర, సహాయ కార్యదర్శి ప్రకాష్, ఇఫ్ టు అధ్యక్షులు ఏసురత్నం, విద్యావంతుల వేదిక వెంకటేష్ రాహుల్ లక్ష్మి విద్యార్థి నాయకులు వీరేంద్ర, వేమయ్య, జలసాధన సమితి నాయకులు పెద్దన్న, వీరు నారప్ప, అరుణోదయ చంద్ర,, ఉమ్మడి కర్నూలు జిల్లా రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు వై. ఎన్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, శేషాద్రి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు పనిముట్లు ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి-గుత్తి

మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు పనిముట్లని ఇవ్వాలని మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు జి.నాగభూషణం డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీకి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక మున్సిపల్ కార్మికుల సమస్యలను గతంలో విన్నవించిన పట్టించుకోలేదన్నారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించడంలో జాప్యం జరుగుతోందన్నారు. రిటైర్డ్ అయిన కార్మికుడు డి.తిమ్మప్ప కుటుంబానికి ఉపాధి కల్పించాలని ఏడాదిన్నరగా చెబుతున్న అధికారులు పట్టించుకోలేదన్నారు. వాహనాలు తరచూ మరమ్మతులు గురవుతున్నాయని తద్వారా కార్మికులు పారిశుద్ధ పనులు చేయడానికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని లేనిపక్షంలో దశలవారీగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పారిశుధ్య కాంట్రాక్టు కార్మికుల సంఘం కార్యదర్శి ఎన్. రామాంజనేయులు, సహాయ కార్యదర్శి టి.సుంకన్న, కోశాధికారి కె.బాలరంగన్న, నాయకులు ఎం.శ్రీనివాసులు, డి.నారాయణస్వామి, కె. మహేష్, టి.నాగరాజు, ఇ.సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు

ఆశావర్కర్‌ను ఆదుకోవాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

శింగనమల ఆశావర్కర్ పద్మావతికి ఆరోగ్యం మెరుగుపడి, విధుల్లోకి వచ్చేంత వరకూ వేతనాలు చెల్లించాలని ఆశావర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి డిమాండ్ చేశారు. బుధవారం బెంగళూరు శ్రీనివాస ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆశా కార్యకర్తలు పద్మావతిని ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగమణి, నాయకులు వెంకటలక్ష్మి, మదార్‌బీతో కలిసి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యకర్తలకు తలకు మేజర్ ఆపరేషన్ జరిగిందని, ఇంకా మనుషులను గుర్తుపట్టలేని స్థితిలోనే ఉందన్నారు. ఇప్పటికే ఆమె పిల్లలు లక్షల రూపాయలు అప్పులు చేసి వైద్య చికిత్సలు చేయిస్తున్నారని, ఆమె ప్రమాదానికి కారణమైన అధికారులు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఆశావర్కర్లకు సంబంధం లేని పనులు చేయించ కూడదు అని కమిషనర్ ఆదేశాలు ఉన్నా ఆశల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని తెలిపారు. కలెక్టర్ జోక్యం చేసుకుని తరిమెల పిహెచ్‌సి అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు.

ఆశావర్కర్‌ను పరామర్శిస్తున్న అంగన్వాడీ నాయకురాళ్లు

నేడు ఉపాధ్యక్షుల ఎన్నిక

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

రాయదుర్గం మండల ఉపాధ్యక్షుడి ఉప ఎన్నిక బుధవారం జరగనుంది. మండల ఉపాధ్యక్షుడిగా ఉన్న కావలి సత్యనారాయణ 2022 నవంబర్ 16న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే 2023 జూన్ 8న, 2023 జూలై 13న మండల అధ్యక్షుడు ఉపఎన్నిక సంబంధించి నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ సభ్యులు పాల్గొనకపోవడంతో ఎన్నిక ప్రక్రియ జరగలేదు. తాజాగా ఉప ఎన్నిక జరగనుంది. ఈ సందర్భంగా ఉపాధ్యక్షుడిగా పోటీ చేసేందుకు వడ్డపన్నూరు ఎంపిటిసి అరుణ్‌కుమార్ పార్టీ తరఫున బీఫారం అందడంతో వైసిపి మండల కన్వీనర్ రామాంజినేయులు, ఎంపిటిసి సురేష్ కలిసి ఎన్నికల అధికారి, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌యాదవ్‌కు బుధవారం ఉపాధ్యక్షుడి ఎన్నికకు సంబంధించిన ఫార్మెట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు శివారెడ్డి, హనుమంత్ రెడ్డి, బొజ్జప్ప తదితరులు పాల్గొన్నారు.

బీఫారం అందజేస్తున్న రాయదుర్గం వైసిపి ఎంపిటిసిలు

యల్లనూరు : యల్లనూరు మండల ఉపాధ్యక్షుని ఎన్నిక బుధవారం జరగనుంది. ఇప్పటి వరకూ ఉపాధ్యక్షుడిగా కొనసాగిన నిర్జూవల్లి గ్రామానికి చెందిన రంగయ్య ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో గురువారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధ్యక్ష ఎన్నిక జరగనున్నట్లు ఎంపిడిఒ వాసుదేవరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఎంపిటిసిలు, మండల కో ఆప్షన్ సభ్యులు హాజరుకావాలని కోరారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలో చేపట్టిన పారిశుధ్యం పనులను కమిషనర్ బాలస్వామి బుధవారం పరిశీలించారు. ముందుగా నగరంలోని ప్రధాన వాణిజ్య సముదాయాలు కలిగిన కమలానగర్‌లో ఎక్కడ చూసినా చెత్తాచెదారాలు, చెత్తకుప్పలతో నిండి ఉండటంతో 3వ సర్కిల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3వ సర్కిల్‌తోపాటు 2వ సర్కిల్‌లో కూడా పనితీరు అలాగే ఉందన్నారు. శానిటరీ ఇన్స్‌పెక్టర్లు తెల్లవారుజాము నుంచే క్షేత్రస్థాయిలోకి వెళ్లి పారిశుధ్య పనులు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. అలాగే ఎప్పటికప్పుడు చెత్తకుప్పలను ట్రాక్టర్లలో తరలించాలన్నారు. పనితీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం కమలానగర్‌లోని పలు ప్రాంతాలను పరిశీలించారు. అక్కడి నుంచి జూనియర్ కళాశాల వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను సందర్శించి అల్పాహార పంపిణీని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ విష్ణుమూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నల్లప్ప, వెంకటేష్, శానిటేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

జిమ్ పరికరాలను పరిశీలిస్తున్న కమిషనర్ బాలస్వామి

పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం

ప్రధానోపాధ్యాయులు జెసి ఎర్రప్ప

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

విద్యా విధానంలో నేడు సాంకేతిక పరిజ్ఞానం పెరిగిందని అనంతపురం రూరల్ పరిధిలోని నందమూరి నగర్ మండల పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జెసి ఎర్రప్ప అన్నారు. ఈనెల 31న ఉద్యోగ విరమణ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ గతంతో పోల్చితే తమ పిల్లలకు విద్య విద్యాబుద్ధులు నేర్పించాలన్న అవగాహన తల్లిదండ్రుల్లో బాగా పెరిగిందన్నారు. దీనికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు తోడయ్యాయన్నారు. ఇకపోతే ఉరవకొండ మండలం కౌకుంట్లకు చెందిన తాను 31 జనవరి 1984లో మైలారంపల్లిలో స్పెషల్ టీచర్‌గా ప్రస్థానం ప్రారంభమైందన్నారు. అక్కడి నుంచి అంచలంచెలుగా ఎదిగి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా బెస్ట్ ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎంగా అవార్డు అందుకున్నట్లు తెలిపారు. 2021 నుంచి ఇప్పటి వరకూ అనంతపురం రూరల్ పరిధిలో ఉన్న నందమూరి నగర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా పని చేస్తున్నట్లు వివరించారు. స్వర్గీయ నందమూరి తారక రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉపాధ్యాయునిగా ఉద్యోగం పొంది ఆయన పేరుమీద ఉన్న నందమూరి నగర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా ఉద్యోగ విరమణ పొందడం సంతోషంగా ఉందన్నారు.

గ్రామాల్లో మొక్కలు నాటించండి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

పచ్చదనం కోసం గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద చనిపోయిన వాటిస్థానంలో తిరిగి మొక్కలను నాటించాలని అధికారులు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి శ్రీదేవి అధ్యక్షతలన సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో మండలంలోని 25 పంచాయతీల్లో 1115 పనులకు రూ.14.48 కోట్ల నిధులతో చేపట్టిన పలు రకాల పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. వీటిలో అధికంగా పచ్చదనం కోసం ప్రభుత్వం చేపట్టిన మొక్కల పెంపకంలో అవినీతి జరిగినట్లు తెల్చారు. ఇందులో మొక్కలు అన్ని చనిపోగా వీటిస్థానంలో రాబోయే వర్షాకాలంలో తిరిగి నాటించాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ సలీంబాషా, అదనపు పిడి సుధాకరరెడ్డి, అంబుడ్స్‌మెన్ వెంకటశివారెడ్డి సూచించారు. అలాగే మస్టర్లలో వేలిముద్రలు, కొట్టివేతలు ఉన్నందున రూ.20వేలు జరిమానా, రూ.12వేల రికవరీకి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బారెన్‌హెబ్, ఎస్ఆర్పీ లక్ష్మీనారాయణ, ఎపిఒ పుల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

IN THE COURT OF THE III ADDL.JUNIOR CIVIL JUDGE: ANANTAPURAM.
O.S. No: 1474/2023

Between:
G. Lingamma ...**Plaintiff**

And

1. C. Mahananda,
2. M.Venkatesh Naik ...**Defendents**

To,
2. M. Venaktesh Naik S/o M. Chandra Naik, Mamrutla Thanda (V), Kuderu (M), Anantapuram Dist.

పై దావాలోని అర్జీదారురాలు నీపైన మరియు సి.మహానంద పైన దావా మొత్తము రాబట్టుకొనుటకు దావా వేసి యున్నది ఇందులకు నీకేమైన ఆక్షేపణలున్న యెడల కోర్టువారి ఎదుట తేది:28-03-2025న ఉదయం 10:30 గం॥లకు ఖుద్దున గానీ లేక వకీలు ద్వారా గానీ తెలుపుకొనవలెను.లేనంతట నీ పరోక్షమందు తీర్మానించబడును.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

T.RANGA REDDY,
Advocate for Plaintiff.

ఎన్నికల నియమావళిపై సమావేశం

యల్లనూరు : ఎన్నికల నియమావళిపై బుధవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ అబీబాఖాన్ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎన్నికలు ఎలా నిర్వహించాలి.. రాజకీయ పార్టీల ప్రలోభాలు, తదితదిర అంశాలపై బిఎల్ఒలకు వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ముని, విఆర్ఒలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి అబీబాఖాన్

సహకార రంగంపై ప్రత్యేక శ్రద్ధ

ఎడిసిసి మహాజన సభలో జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ

ప్రజాశక్తి-అనంతపురం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకార రంగంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాయని జాయింట్ కలెక్టర్, పర్సన్ ఇన్‌ఛార్జి శివ్‌నారాయణ్‌శర్మ తెలిపారు. బుధవారం నగరంలోని ఎడిసిసి బ్యాంకు ప్రధాన కార్యాలయంలో జెసి అధ్యక్షతన 128వ మహాజన సభ నిర్వహించంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్నిసంఘాలు కంప్యూటరీకరణ పూర్తి చేసుకోవాలన్నారు. వచ్చేనెల 1వతేదీన ఉంచి అన్ని కార్యకలాపాలు కంప్యూటర్‌లోనే జరగాలని ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు సంబంధించిన పాక్స్ సిఇఒ, పిఐసి, సూపర్‌వైజర్, సంబంధిత అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. కాగా ప్రతి సంఘం డిపాజిట్లు సేకరించాలన్నారు. అలాగే వాయిదా మీరిన రుణాలపై త్వరితగతిన లీగల్ కవరేజ్ పూర్తి చేసి మొండి బకాయిలను వసూలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. సహకార సంఘాల పర్సన్ ఇన్‌ఛార్జిలు క్రమం తప్పకుండా సంఘాలను సందర్శించి అభివద్ధి బాటలో నడపాలని కోరారు. ప్రతి బ్రాంచి, సంఘాలకు గుర్తింపు బోర్డు (సైన్ బోర్డు) ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. బ్రాంచీల భవనాలు ఆధునీకరణ చేసుకొని, ఖాతాదారుల సంఖ్యను పెంచుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఈనెల 28వ తేదీతో ముగిసిన బ్యాంకు ఆర్థిక లావాదేవీలపై సమీక్షించారు. తర్వాత 2025-26 సంవత్సరానికి బ్యాంకుకు సంబంధించిన రూ.167.50 కోట్ల అంచనా బడ్జెట్‌కు ఆమోదించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిఇఒ కె.సురేఖారాణి, అనంతపురం జిల్లా సహకార అధికారి అరుణకుమారి, శ్రీసత్యసాయి జిల్లా సహకార అధికారి కృష్ణానాయక్, నాబార్డ్ డిడిఎం అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

ఎడిసిసిబి మహాసభలో మాట్లాడుతున్న జెసి శివ్‌నారాయణ్‌శర్మ

హమాలీల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు జిల్లా నాయకులు బి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుంతకల్లు

ఆర్టీసీ బస్టాండ్‌లో పని చేస్తున్న హమాలీల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో పని చేస్తున్న పలువురు హమాలీలు బుధవారం పట్టణంలోని హంపిరెడ్డి భవనంలో సిఐటియులో చేరారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు బి.శ్రీనివాసులు కండువాలు కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా యూనియన్ పట్టణ ప్రధాన కార్యదర్శి సాకే నాగరాజు మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాండ్‌లో హమాలీలుగా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వారికి ఎలాంటి గుర్తింపు లేదన్నారు. దీంతో ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందడం లేదన్నారు. హమాలీలకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, కూలి రేట్లు పెంచాలని, ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలి, ఆర్టీసీ పార్శెల్ సర్వీస్ కార్గో ఏర్పడినప్పటి నుంచి కూలీలు సరిగా రావడం లేదన్నారు. హమాలీలా కూలీలు సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిఐటియులో చేరిన వారిలో హమాలీలు ఎం.రవికుమార్, బి.శంకర, కె.భీమన్న, బి.చంద్రశేఖర్, కె.రాము, బి.గణేష్, బి.నాగరాజు, కె.కిరణ్, రిక్షా కార్మికులు వై.శ్రీనివాసులు, చాంద్‌బాషా ఉన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు మారుతీప్రసాద్, ఎస్‌కెఎం బాషా, పట్టణ నాయకులు వై.మల్లికార్జున, రాజేష్, వెంకీ, తిమ్మప్ప, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

సిఐటియులో చేరిన హమాలీలు

బాలల సమగ్రాభివృద్ధితోనే దేశ భవిష్యత్తు

సామాజిక కార్యకర్త నల్లాని రాజేశ్వరి

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

రేపటి పౌరులైన నేటి బాలల సమగ్రాభివృద్ధే దేశ భవిష్యత్తుకు అవసరమని ప్రముఖ సామాజిక కార్యకర్త నల్లాని రాజేశ్వరి అన్నారు. 'బాలల హక్కులు - చట్టాలపై విద్యార్థులకు చైతన్య సదస్సులు నిర్వహించాలని బుధవారం స్థానిక శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఇన్‌ఛార్జి ఉపకులపతి అనితను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల హక్కుల రక్షణకు సంబంధించి దేశంలో కొన్ని ముఖ్యమైన చట్టాలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా జువెనైల్ జస్టిస్ చట్టం గురించి వివరించారు. ఈ చట్టం బాలల సంక్షేమం, రక్షణ, పునరుద్ధరణకు సంబంధించిన అంశాలను కలిగి ఉందన్నారు. బాల్య వివాహ నిషేధ చట్టం (2006) ఎంతో కీలకమైందన్నారు. ఈ చట్టం బాల్య వివాహాలను నిషేధించి, వాటిని పూర్తిగా నివారించేందుకు తగిన చర్యలు తీసుకుందన్నారు. లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం (2012) బ్రహ్మాస్త్రం వంటిదన్నారు. లైంగిక నేరాల నుండి పిల్లలను రక్షించడానికీ, బాధితులకు సహాయం అందించడానికి, నేరస్థులకు శిక్ష విధించడానికి రూపొందించారని చెప్పారు. 6 నుండి 14 సంవత్సరాల వయస్సు ఉన్న ప్రతి బిడ్డకూ విద్య ప్రాథమిక హక్కుగా ఉందన్నారు. జాతీయ, రాష్ట్రస్థాయిలో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్లు పిల్లల హక్కుల రక్షణ కోసం పనిచేస్తున్నాయన్నారు. ఆయా చట్టాలు, హక్కులపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఇందుకు విసి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ రమేష్‌బాబు, పరీక్షల విభాగం సంచాలకులు, సోషియాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ జివి రమణ, ఎన్ఆర్ఐ ఫౌండేషన్ సిఇఒ గుత్తా హరిసర్వోత్తమ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కెయు విసితో నల్లారి రాజేశ్వరి

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి

మండల వ్యవసాయ శాఖ అధికారులు

ప్రజాశక్తి-పామిడి

రైతులు భూసార పరీక్షలు చేయించుకుని వాటి ఆధారంగానే ఎరువులు వాడాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి వసుంధర సూచించారు. బుధవారం మండలంలోని ఎద్దులపల్లి, జి.కొట్టాల, కాళాపురం గ్రామాల్లో పర్యటించిన ఎఒ భూసార పరీక్షలతోపాటు వివిధ అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు అవసరానికి మించి ఎరువులు వాడడం వల్ల భూసారం తగ్గిపోతోందన్నారు. అంతేకాకుండా లభ్య నత్రజని, భాస్వరం, ఫొటాస్ శాతం ఎక్కువగా ఉందన్నారు. కావున రైతులు భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగించాలని కోరారు. అదేవిధంగా రైతులకు విశిష్ట సంఖ్య నమోదుపై అవగాహన కల్పించారు. అలాగే ప్రభుత్వం ఏర్పాటు చేసిన పప్పుశనగ కొనుగోలు కేంద్రాల్లో రైతులు పంటను విక్రయించుకోవాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో ఎఇఒ శ్రీనివాసరావు, ఎంపిఇఒ లక్ష్మీనారాయణ, రామాంజనేయులు, విహెచ్‌ఎ చిరంజీవి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పామిడి ఎఒ వసుంధర

ఉరవకొండ : భూసార పరీక్షల ఆధారంగా రైతులు ఎరువులు వాడాలని భూసార పరీక్ష కేంద్రం జిల్లా సహాయ వ్యవసాయక సంచాలకులు రోజా పుష్పలత సూచించారు. బుధవారం విడపనకల్ మండల పరిధిలోని పోలికి గ్రామంలో మండల వ్యవసాయ అధికారి పేన్నయ్య ఆధ్వర్యంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోజా పుష్పలత మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్ర్యమంలో భూసార పరీక్షా కేంద్రం అధికారి ప్రతాప్, రాఘవేంద్ర, విఎఎ రమేష్‌నాయిక్, తదితరులు పాల్గొన్నారు.

కుక్కలు, కోతుల బెడదను అరికట్టాలి

కౌన్సిల్ సమావేశంలో సభ్యులు

ప్రజాశక్తి-గుత్తి

మున్సిపాలిటీ పరిధిలో కుక్కలు, కోతులు, రహదారులపై ఆవుల బెడద అధికమైందని అరికట్టాలని పలువురు కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ భవనంలో ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు వి.వరదరాజులు, ఎన్.ఫారూఖ్, వాల్మీకి శివ, వెంకటరమణ మాట్లాడుతూ కుక్కలు, కోతులు వార్డుల్లోని ప్రజలపై దాడులకు దిగుతున్నాయని చెప్పారు. రహదారులపై ఆవులు ఉండడంతో ప్రమాదాలు జరిగే వాహనదారులు గాయాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు సమావేశాల్లో విన్నవించిన అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. రానున్న ఉగాది, రంజాన్ పండగల సందర్భంగా ఆలయాలు, మసీదుల వద్ద శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని కోరారు. నాలుగవ వార్డులో మురికి కాలువలను నిర్మించాలని నాలుగేళ్లుగా సమావేశాల దృష్టికి తెస్తున్నా అధికారులు పట్టించుకోలేదని కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. గుత్తి, ఆర్ఎస్‌లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని వైస్ ఛైర్‌పర్సన్ బి.వరలక్ష్మి అన్నారు. సమస్యలను పరిష్కరిస్తామని కమిషనర్ బి.జబ్బర్ మియా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ పి. రాంబాబు, రెవెన్యూ అధికారి కమలాకర్ సతీష్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ మహబూబ్ బాషా, ఎఇ హరికిరణ్, రవికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న మున్సిపల్ సభ్యులు

గ్రామాల అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే జేసీ

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

గ్రామాలను అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలం పరిధిలోని నరసాపురం గ్రామంలో నిర్వహించిన గ్రామసభ నిర్వహించారు. ఇందులో భాగంగా సీసీ రోడ్డు, డ్రెయినేజీ, తాగునీరు, పింఛన్లు వంటి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాధాన్యతను బట్టి ఆయా సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బాలాజీరాజ్, ఎంపిడిఒ శకుంతలమ్మ, ఎస్ఐ నాగేంద్రప్రసాద్, మండల్ ఇంజినీర్ ప్రసన్నకుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీర్ లక్ష్మీనారాయణ, ఎపిఎం గంగరాజు, టిడిపి సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి, నరసాపురం భాస్కర్‌రెడ్డి, పెద్ద యక్కలూరు పెద్దిరెడ్డి, రాజారెడ్డి, సింగనగుంటపల్లి రాజు, ఆసుపత్రి రెడ్డి, నాగార్జునరెడ్డి, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత

ప్రజాదర్బార్‌లో విప్ కాలవ

ప్రజాశక్తి-గుమ్మఘట్ట

చంద్రబాబు నాయకత్వంలోని కూటమి రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత ఇస్తోందని విప్ కాలవ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఐకెపి భవన్‌లో ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలు భారీగా తరలివచ్చి సమస్యలను విన్నవించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల ఆశీసులు, ఆకాంక్షలతో ఏర్పడిందన్నారు. వారిని బాగా చూసుకోడానికి నిరంతరం కష్టపడి పని చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

వినతులను స్వీకరిస్తున్న కాలవ శ్రీనివాసులు

కళాక్షేత్రం ఏర్పాటు చేయాలని వినతి

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలో కళా క్షేత్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రజానాట్య మండలి నాయకులు బుధవారం పట్టణంలోని పరిటాల కళ్యాణ మంటపంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజానాట్య మండలి పట్టణ అధ్యక్షులు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి టి.పులయ్య మాట్లాడుతూ పట్టణంలోని ప్రజానాట్య మండలి కళాక్షేత్రాన్ని ఏర్పాటు చేయాలని వినతిపత్రాలు అందజేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. కనీసం మీరైనా స్పందించి కళాక్షేత్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ కళాక్షేత్రాన్ని ఏర్పాటు చేయడానికి కృషి చేస్తాననిహామీ ఇచ్చారు.

విద్యుత్ ఛార్జీల పెంపును ఉపసంహరించుకోవాలి

అనంతపురం కలెక్టరేట్ : విద్యుత్ వినియోగదారులపై భారాలు మోపే విధానాలు టిడిపి కూటమి ప్రభుత్వం ఉప సంహరించుకోవాలని, స్మార్ట్ మీటర్లు బిగించరాదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, ఎం.బాలరంగయ్య డిమాండ్ చేశారు. బుధవారం కందుకూరు గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో రూపొందించిన 'విద్యుత్ షాకులు' బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యుత్ భారాలు మోపుతోందన్నారు. జగన్ సర్కార్‌లో స్మార్ట్ మీటర్లు అడ్డుకున్న కూటమి నేతలు నేడు అధికారంలోకి రాగానే వాటిని అమలు చేయడం దుర్మార్గంగా ఉందన్నారు. తక్షణమే స్మార్ట్ మీటర్‌ల ఏర్పాటును ఉప సంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు టి.రామాంజనేయులు, ప్రాంతీయ కమిటీ సభ్యులు పోతలయ్య, రాయమ్మ, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సిపిఎస్‌ను రద్దు చేయాల్సిందే : యుటిఎఫ్

బొమ్మనహాళ్ : సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోవిందరాజులు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని దేవగిరి గ్రామంలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ప్రాథమిక పాఠశాలలో కొనసాగించాలని, 3, 4, 5వ తరగతులను మ్యాపింగ్ చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో నాగభూషణం, ఆంజనేయులు, రాఘవేంద్ర, వీరోబులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్పంచి ప్రశాంత్‌కు పితృవియోగం

అనంతపురం : అనంతపురం రూరల్ పరిధిలోని కందుకూరు పంచాయతీ సర్పంచి ప్రశాంత్‌కుమార్‌కు పితృవియోగం కలిగింది. ప్రశాంత్‌కుమార్ తండ్రి లింగమయ్య మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుఉకున్న పలువురు లింగమయ్యకు నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఇటుకలపల్లి, కక్కలపల్లి కాలనీల సర్పంచులు భాస్కర్‌రెడ్డి, కృష్ణయ్య, పంచాయతీ కార్మికులు ఉన్నారు.

నివాళులర్పిస్తున్న నాయకులు

రీసర్వేతో భూ సమస్యలు పరిష్కారం

పెద్దవడుగూరు : గ్రామాల్లో చేపడుతున్న రీసర్వేతో భూమి సమస్యలు తక్షణమే పరిష్కారం అవుతాయని తహశీల్దార్ ఉషారాణి సూచించారు. బుధవారం మండలంలోని చిత్రచేడు, చిట్టూరు గ్రామాల్లో రీసర్వే ప్రారంభించి రైతులతో సమావేశమై చర్చించారు. రీసర్వే చేపట్టడం వల్ల మీకు ఇదివరకు ఉన్న పలు సమస్యలు తీరుతాయన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రీసర్వే ఉప తహశీల్దార్ జయమ్మ, మండల సర్వేయర్ ప్రసాద్, సర్పంచి రాము, రెవెన్యూ, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

01 సర్క్యులర్‌ను అమలు చేయాలని వినతి

అనంతపురం సిటీ : గతంలో ఇచ్చిన 01/2019 సర్క్యులర్‌ను అన్ని డిపోల్లో అమలు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.రమణారెడ్డి కోరారు. ఈమేరకు బుధవారం నగరంలో ఆర్టీసీ సంస్థ నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఆర్టీసీ ఛైర్మన్ పూల నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ఇందుకు ఛైర్మన్ సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ అనంతపురం డిపో ప్రెసిడెంట్ వి.సూరిబాబు, డిపో కార్యదర్శి పి.రామాంజనేయులు, రీజియన్ నాయకులు పాల్గొన్నారు.

తడి, పొడిచెత్తపై అవగాహన

నార్పల : మండల పరిధిలోని నాయనపల్లి, వెంకటాంపల్లి గ్రామాల్లో బుధవారం సాయంత్రం తడిచెత్త, పొడి చెత్తపై కళాజాతా కళాకారుల బృందం అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రత తోనే సంపూర్ణ ఆరోగ్యమని.. అందుకు అనుగుణంగా ప్రజలు పరిశుభ్రతను పాటించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాజాత కళాకారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో చిన్నారి మృతి

మృతిచెందిన అభినయశ్రీ

కళ్యాణదుర్గం రూరల్ : మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన అభినయశ్రీ (6) విద్యుదాఘాతంతో మృతిచెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కొత్తూరుకు చెందిన ఈరన్న, రేణుకమ్మకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ముగ్గురూ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు వెళ్లారు. అమ్మ చింతపండు తొలిచేందుకు కూలికి వెళ్లింది. ఈనేపథ్యంలో తల్లి వద్దకు వెళ్లి ఇంటి తాళాలు తీసుకొస్తూ 2వ కుమార్తె అభినయశ్రీ కాలనీ సమీపంలో విద్యుత్ స్తంభం వద్ద వేలాడుతున్న జీ వైర్‌ను తాగింది. దీంతో షాక్ గురైంది. వెంటనే చిన్నారిని చికిత్స నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కుమార్తె మృతితో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టిడిపి నేత ధర్మతేజ నివాళి

విద్యుత్ ప్రమాదంలో మృతిచెందిన చిన్నారికి టిడిపి నాయకులు ధర్మతేజ నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. తర్వాత రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలోని పరిటాల కళ్యాణ మంటపంలో నియోజకవర్గంలోని 45 మంది లబ్ధిదారులకు మంజూరైన సిఎం రిలీఫ్ చెక్కులను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే మండలంలో 45 మందికి రూ.41.11 లక్షల చెక్కులు మంజూరైనట్లు తెలిపారు. అంతకు ముందు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ నాయకులు వాసగిరి మణికంఠ, పట్టణ అధ్యక్షులు బండారు ఆనంద్, డాక్టర్స్ సెల్ అధ్యక్షురాలు పత్తి హిమబిందు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన

ఉరవకొండ : మండల పరిధిలోని రాకెట్లలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి పావని ఆధ్వర్యంలో వడదెబ్బపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ, నాగరంగయ్య మాట్లాడుతూ వేసవి తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఎండలో తిరగ రాదన్నారు. ఒకవేళ అత్యవసరమైతే తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం వడదెబ్బకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు

లింగ వివక్ష నిర్మూలనపై అవగాహన

ఉరవకొండ : వజ్రకరూరు మండల పరిధిలోని చాబాల గ్రామంలో లింగ వివక్ష నిర్మూలనపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు మల్లెల జగదీష్, హెల్త్ ఎడ్యుకేటర్, వేణుగోపాల్, ఎంపిహెచ్ఇఒ విజయ్‌కుమార్, సిహెచ్ఒ పావనికుమారి, ఎఎన్ఎం ఇందిరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి నిత్యావసరాలు పంపిణీ

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు, పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి, డాక్టర్ జి.హేమలత ఆధ్వర్యంలో పేద కుటుంబానికి రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను అందించారు. ఇటీవల విద్యుత్ ప్రమాదానికి గురై గాయపడిన అవుట్ సోర్సింగ్ ఎలక్ట్రిక్ ఉద్యోగి నరసింహస్వామి కుటుంబానికి 32 రకాల నిత్యావసరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల ఆహ్వాన పత్రికలు ఆవిష్కరణ

అనంతపురం : నగరంలోని మొదటి రోడ్డులో ఉన్న కాశీ విశ్వేశ్వర, కోదండ రామాలయంలో ఉగాది, శ్రీరామ నవమి ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్, టిడిపి నాయకుడు సుందర్, ఆలయ అర్చకులు కిషోర్‌కుమార్, ఆలయ కమిటీ నిర్వాహకులు నరేంద్రచౌదరి, శ్రీనివాస్ చౌదరి, వెంకటరమణ, ఎర్రిస్వామి,రాజు, రామాంజనేయులు, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

అనంతపురం : నగరంలోని జెఎన్‌టియు రోడ్డులో మంగళవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచు ఉదయ్, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి ఎండలతో అల్లాడుతున్న ప్రజలు, నగర వాసులకు దాహార్తి తీర్చేందుకు రూరల్ పంచాయతీ అధికారులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలకు చలివేంద్రాన్ని వినియోగించుకోవాలని కోరారు.

బుక్కరాయసముద్రం సిఐ బదిలీ

బుక్కరాయసముద్రం : బుక్కరాయసముద్రంలో పని చేస్తున్న సిఐ కరుణాకర్‌ను తిరుపతి విఆర్‌కు బదిలీ చేస్తూ డిఐజి షిమోషి బుధవారం ఆదేశాలు జారీ చేశారు. టిడిపి కార్యకర్తను పోలీసులు కొట్టారని ఆరోపిస్తూ మంగళవారం రాత్రి టిడిపి నాయకులు పోలీస్‌స్టేషన్ ముందు ధర్నా నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో టిడిపి నాయకుల ఫిర్యాదు మేరకు సిఐ కరుణాకర్‌ను బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

పన్ను రాయితీని సద్వినియోగం చేసుకోండి

తాడిపత్రి ఎస్ఎల్ఎన్ థియేటర్ వద్ద పన్నులు వసూలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్, సిబ్బంది

ప్రజాశక్తి-తాడిపత్రి

ఈనెల 31వతేదీలోపు ఆస్తి పన్నుదారులు పన్ను చెల్లించి ప్రభుత్వం ప్రకటించిన 50శాతం వడ్డీ రాయితీని పొందాలని కమిషనర్ సుబ్బి రామకృష్ణ సూచించారు. బుధవారం పట్టణంలోని సాయితేజ, విజయలక్ష్మి, వైఎల్ఎన్ గ్రాండ్, ఎస్ఎల్ఎన్ థియేటర్లతోపాటు పట్టణంలోని పలుప్రాంతాలలో బుధవారం పర్యటించారు. ఇందులో భాగంగఈ ఇంటి, నీటి పన్నులతోపాటు మొండి బకాయిలను వసూలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునిసిపల్ శాఖ ఉత్తర్వులు మేరకు పన్నులు ఏకమొత్తంలో చెలించిన వారికి 50 శాతం వడ్డీ రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పన్నుదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఓ, ఆర్ఐ పవన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాయదుర్గం : రాయదుర్గం పురపాలక సంఘం పరిధిలోని ప్రజలకు ఈనెల 31వతేదీలోపు ఆస్తి పన్ను చెల్లించి వడ్డీలో 50శాతం రాయితీ పొందాలని కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సకాలంలో పన్నులు చెల్లించి సహకరించాలని కోరారు.

గుత్తి : పురపాలక సంఘ పరిధిలో ఆస్తి పన్నులు ఈనెలాఖరులోపు చెల్లిస్తే 50 శాతం వడ్డీ మాఫీ ఉంటుందని మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్‌మియా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నివాసాలు, ఖాళీ స్థలాల పన్నులు బకాయిల పైన కూడా 50 శాతం వడ్డీ మాఫీ చేస్తామన్నారు. ప్రజలు పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

గుంతకల్లు : రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్ను బకాయిలపై 50 శాతం వడ్డీ రాయితీ ఇచ్చిందని మున్సిపల్ కమిషనర్ నయూమ్ అహ్మద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్తి పన్ను, ఖాళీ స్థలం పన్ను ఒకే విడతలో మార్చి 31లోపు చెల్లించిన వారికి మొత్తం వడ్డీలో సగం వడ్డీ మాఫీ రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు.

పంచాయతీ పైపులైన్లు ధ్వంసం

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని పులసలనూతల గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పైపులైన్లు, స్టార్టర్లను బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. కొద్ది రోజుల క్రితం గ్రామంలో తీవ్రమైన నీటి ఎద్దడి నెలకొనడంతో అధికారులు గ్రామంలోని కుంటలో నూతన బోరు వేసి పైపులైన్, స్టార్టర్లు ఏర్పాటు చేశారు. ఈనేపథ్యంలో గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడం విశేషం. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి శ్యామల నార్పల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న ఎస్ఐ సాగర్ కేసును విచారించి బాధ్యులను శిక్షిస్తామని తెలిపారు.

రక్తదాన శిబిరం

గుత్తి : . సినీ హీరో రామ్ చరణ్ పుట్టినరోజును పురస్కరించుకుని బుధవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో బుధవారం మెగా అభిమానులు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దాదాపు 40 మంది యువకులు శిబిరానికి తరలివచ్చి రక్తదానం చేశారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత చిరంజీవి యువత జిల్లా అధ్యక్షుడు పాటిల్ సురేష్, రామ్ చరణ్ యువశక్తి జిల్లా ప్రధాన కార్యదర్శి బోయగడ్డ బ్రహ్మయ్య, మిద్దె ఓబులేసు, అశ్వ నాగప్ప, వెంకటపతి నాయుడు, రంగస్వామి, హరి, షేక్షావలి, ఖాజా, రోహిత్, భాస్కర్, చరణ్, భరత్, శ్రీనాథ్, సుధాకర్, రంగా, ధనుంజయ, సోము, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసరాలు పంపిణీ

పెద్దవడుగూరు : ఉగాది పండుగను పురస్కరించుకుని పెద్దవడుగూరు పంచాయతీలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు బుధవారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచి వరలక్ష్మి, ఇఒఆర్‌డి నరసింహారెడ్డి గ్రామంలోని పలు కాలనీల్లో ఉదయమే వెళ్లి తడి, పొడిచెత్తను తీసుకెళ్లి పరిశుభ్రతకు తోడ్పాటును అందించిన కార్మికులు సంతోషం ఉండాలని సరుకులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు, బిల్ కలెక్టర్ జయరాముడు, తదితరులు పాల్గొన్నారు.

1న రాతిదూలం లాగుడు పోటీలు

పుట్లూరు : మండల కేంద్రం సమీపంలోని సుంకులమ్మ ఆలయం వద్ద వచ్చేనెల 1వతేదీన రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1వ బహుమతి రూ.60వేలు, 2వ బహుమతి రూ.50వేలు, 3వ బహుమతి రూ.40వేలు, 4వ బహుమతి రూ.30వేలు, 5వ బహుమతి రూ.25వేలు, 6వ బహుమతి రూ.20వేలు, 7వ బహుమతి రూ.15వేలు, 8వ బహుమతి రూ.12వేలు, 9వ బహుమతి రూ.11వేలు, 10వ బహుమతి రూ.10వేలు, 11వ బహుమతి రూ.6వేల బహుమతులు అందజేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

మెడికల్‌షాపు తనిఖీ

రాయదుర్గం : పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఉన్న విజయలక్ష్మి మెడికల్ దుకాణాన్ని జిల్లా డ్రగ్ ఇన్స్‌పెక్టర్ పి.హనుమన్న బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా వెయ్యికిపైగా 'బొసెక్స్' అనే మందు బాటిళ్లను గుర్తించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, పోలీసుల సమక్షంలో పంచనామా నిర్వహించి మత్తును కలిగించేదిగా గుర్తించి సీజ్ చేశారు. కేసు నమోదు చేసి కోర్టుకు స్వాధీనం చేయనున్నట్లు డ్రగ్ ఇన్స్‌పెక్టర్ తెలిపారు.

నేడు వేలంపాట

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పురపాలక సంఘం పరిధిలోని దినసరి కూరగాయల మార్కెట్, వారపు సంత మార్కెట్, జంతు వధశాల వేలంపాటలు గురువారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొనాలనుకునే వారు కూరగాయల మార్కెట్‌కు రూ.50వేలు, రూ.3లక్షల సాల్వెన్సీ, సంత మార్కెట్‌కు రూ.35వేల ధరావత్తు, రూ.1.50లక్షల సాల్వెన్సీ, జంతు వధశాలకు రూ.20వేల ధరావత్తు, రూ.లక్ష సాల్వెన్సీతో హాజరు కావాలని కోరారు.

సజావుగా కౌన్సిల్ సాధారణ సమావేశం

కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న సభ్యులు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ఛైర్‌పర్సన్ పొరాళ శిల్ప అధ్యక్షతన బుధవారం నిర్వహించిన పురపాలక సంఘం సాధారణ, అత్యవసర సమావేశం సజావుగా సాగింది. గతనెలలో జరిగిన కౌన్సిల్ సమావేశం సందర్భంగా పాలకమండలి సభ్యులు, వారి కుటుంబ సభ్యుల మధ్య ఘర్షణ జరిగిన నేపథ్యంలో పోలీసు ఇన్స్‌పెక్టర్ జయనాయక్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పాలక మండలి సభ్యులు, అధికారులు, పాత్రికేయులు మినహా ఇతరులను కౌన్సిల్ హాలు వద్దకు అనుమతించ లేదు. కాగా 32 మంది సభ్యులకుగాను ఒకరు మినహా మిగతా అందరూ హాజరయ్యారు. గతనెలలో జరిగి వాయిదా పడిన అజెండాలోని అంశాలు ఈనెల అజెండాలో తిరిగి చర్చకు వచ్చాయి. సభ్యుల చర్చల అనంతరం కౌన్సిల్ తీర్మానం ఆమోదించింది. అనంతరం జరిగిన అత్యవసర సమావేశం అజెండాలని అంశాలను కూడా పాలకమండలి ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో వైస్‌ఛైర్మన్లు శ్రీనివాస్‌యాదవ్, వలిబాషా, పాలకు మండలి సభ్యులు అధికారులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యనందించాలి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మంచి పోషణతోపాటు విలువలతో కూడిన విద్యనందించాలని తాడిపత్రి ఐసిడిఎస్ సిడిపిఒ సాజిదాబేగం సూచించారు. బుధవారం మండలంలోని కిష్టిపాడు ఉన్నత పాఠశాలలో అంగన్వాడీలకు 'పోషణ బీ పదాయిబీ' కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రానికి వచ్చే జీరో నుంచి ఆరేళ్లలోపు చిన్నారులకు మంచి పోషణ ప్రభుత్వం అందిస్తున్నందున విలువలతో కూడిన విద్యను అందించి మంచి విద్యార్థినులుగా తీర్చిదిద్దాలని చెప్పారు. చిన్నారులు మానసికంగా, శారీరకంగా, సామాజికంగా పెరిగేందుకు పోషకాహారం ఎంతో ఉపయోగపడుతున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణమ్మ, డేనియల్, రామలక్ష్మి, విజయ, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, శంషాద్, తదితరులు పాల్గొన్నారు.

బిసిలను బానిసలుగా మార్చొద్దు

ఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు పోతుల నాగరాజు

అనంతపురం : రాష్ట్రంలో 56 శాతం ఉన్న బలహీన వర్గాల జనాభాకు ఆదరణ పేరుతో పనిముట్లు, పెన్షన్ పేరుతో బానిసలుగా మార్చొద్దని రిజర్వేషన్ల పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు పోతుల నాగరాజు బుధవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. నిజంగా బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమంపై చిత్త శుద్ధి ఉంటే నాణ్యమైన ఉచిత విద్య, మెరుగైన వైద్యం, యువతకు ఉపాధి, ఉద్యోగాలు, ఉద్యోగ నైపుణ్యం కోసం ఉచిత శిక్షణ, ఉపాధి కోసం ఏర్పాటు చేసుకునే చిన్న, మధ్య పరిశ్రమలకు బ్యాంకుల నుంచి ఎలాంటి గ్యారెంటీ లేని రుణాలు ఇప్పించాలని సూచించారు. పారిశ్రామిక వాడల్లో బలహీన వర్గాలకు 50 శాతం భూములను కేటాయించి పరిశ్రమలు నెలకొల్పడానికి సహకరించాలని కోరారు.

చీరలు పంపిణీ

అనంతపురం కలెక్టరేట్ : రంజాన్ పండుగ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్, టిడిపి మైనార్టీ రాష్ట్ర నాయకులు గౌస్‌మొద్దీన్ ఆధ్వర్యంలో పేద ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. బుధవారం సాయినగర్‌లోని ఆయన నివాసం వద్ద పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, తెలుగుదేశం పార్టీ నాయకులు డిష్ ప్రకాష్, బాబా ఫక్రుద్దీన్, రఫీ, గోపాల్, లక్ష్మీనారాయణ, మహేష్ నందమూరి అభిమానులు బుల్లె రామకృష్ణ, హరీష్‌రెడ్డి, జాఫర్, సుధాకర్, బాబు, రామాంజి, తదితరులు పాల్గొన్నారు.

కోనారెడ్డి సతీమణి సులోచనకు నివాళి

అనంతపురం రూరల్ : ఎడిసిసి బ్యాంకు ఛైర్మన్ తరిమెల కోనారెడ్డి సతీమణి తరిమెల సులోచన బుధవారం అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి అరవింద్ నగర్‌లో ఉన్న కోనారెడ్డి నివాసంలో సులోచన భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కోనారెడ్డిని పరామర్శించి ధైర్యం చెప్పారు.